సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 8 । నవంబర్ । 2023



3,21,854 మందికి..

వైఎస్సార్ రైతు భరోసా నగదు విడుదలైంది. రూ.132.41 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

- 10లో



ఆస్తి కోసం హత్య

ఆస్తి కోసం సొంత తమ్ముడినే అన్నయ్యలు చంపేశారు. కంచిలి మండలంలో ఘటన జరిగింది.

- 10లో



బహిరంగ సభ ప్రసంగాలను ఆసక్తిగా వింటున్న ప్రజలు



ఆమదాలవలస బహిరంగ సభకు హాజరైన జనవాహినిలో ఒక భాగం..

సంక్షేమం సాక్షిగా...

టీడీపీ ఏమైనా చేసిందా..?



చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో జిల్లాకు ఏమైనా మేలు చేశారా..? నాలుగున్నరేళ్ల పాలనలో మేం చేసిన మంచిని గర్వంగా గొంతెత్తి చెబుతున్నాం. దీనిపై ఏ టీడీపీ నాయకుడైనా చర్చకు రాగలడా. గతంలో అధికారంలో ఉన్నప్పుడే ఏమీ చేయని చంద్రబాబుకు మళ్లీ అధికారం ఎందుకు..? ప్రస్తుతం రాష్ట్రంలో జనమంతా జగన్ నామస్మరణ చేస్తున్నారు. ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబు ప్రజల నమ్మకం పొందలేరు.

– తమ్మినేని సీతారాం, స్పీకర్

మాట నిలబెట్టుకుంటారు...



సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారు. మూలపేట పోర్టు, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ దీనికి నిదర్శనం. చంద్రబాబు ఏ నాడూ హామీని నిలబెట్టుకోలేదు. రుణమాఫీతో రైతులు, మహిళలు ఎంతగా మోసపోయారో అందరికీ తెలుసు. వైఎస్ జగన్ హయాంలోనే ఆమదాలవలస నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారు. అందుకే జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు అంతా సిద్ధంగా ఉండాలి.

– ధర్మాన ప్రసాదరావు, మంత్రి

స్టీలు కుర్చీల ఎంపీ



ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు స్టీలుకుర్చీల ఎంపీ అని పేరు పొందారు. ఆ కుర్చీలు వేయడం తప్ప ఆయన చేసిందేమీ లేదు. ఆమదాలవలసలోనూ కూన రవి కుమార్ చేసింది శూన్యం. నియోజవర్గాన్ని దోచుకునేందుకే రవికుమార్‌కు సమయం సరిపోయింది. ఎంతసేపూ స్పీకర్ తమ్మినేనిని విమర్శిస్తే సరిపోతుందనుకోవడం ఆయన అవివేకం.

– సీదిరి అప్పలరాజు, మంత్రి

మొట్టమొదటిది..



శ్రీకాకుళం జిల్లా చిట్టచివరిది అంటున్నారు. కానీ రాష్ట్రంలో ఇదే మొదటి జిల్లాగా భావించడం జరుగుతోంది. ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తోంది. ఎమ్మెల్యేలు గడపగడపకూ వెళ్లి సంక్షేమం కోసం ఆరా తీసి అక్కడే పరిష్కరిస్తున్నారు.

– జూపూడి ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు

జనయాత్ర
జైత్రయాత్ర

జన కెరటం ఆమదాలవలసను ముంచెత్తింది. వాకలవలసలో మొదలైన.. జన ప్రవాహం ఎగసిపడుతూ.. ఆమదాలవలస చేరే సరికి ఉత్తుంగ తరంగంగా మారింది. అలల ఘోషను మించి 'జై జగన్' నినాదాలు హోరెత్తాయి. వెరసి పట్టణ నడిబొడ్డున జనసంద్రంగా ఆవిష్కృతమైంది. బైక్ ర్యాలీలు, యువత కేరింతలు, జనం జేజేలు.. వెరసి పట్టణమంతా కోలాహలంగా మారింది. వైఎస్సార్‌సీపీ పతాకాలు, బ్యానర్లతో కొత్త శోభ సంతరించకుంది. సామాజిక సాధికార బస్సుయాత్ర ఒక జైత్రయాత్రను తలపించింది. నాయకులు తమ ప్రసంగాల్లో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నప్పుడు.. ప్రభుత్వ పనితీరు గురించి మాట్లాడుతున్నప్పుడు.. జనం హర్షాతిరేకాలతో సంపూర్ణ సమ్మతి తెలిపారు.

- ఆమదాలవలసలో వైభవంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- నాయకులతో మమేకమైన బడుగు, బలహీన వర్గాలు
- బస్సు యాత్రకు అడుగడుగునా నీరాజనాలు
- ఉర్రూతలూగించిన ప్రసంగాలు



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



యాత్రలో జోష్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఆమదాలవలస జన సంద్రమైంది. మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు భారీ ఎత్తున జన సమూహం తరలివచ్చింది. పల్లెలకు పల్లెలు కదలివచ్చాయి. వాకలవలసలో మొదలైన బస్సు యాత్ర ఆమదాలవలసలోకి ప్రవేశించగానే మోటార్ బైక్‌లతో నియోజకవర్గ ప్రజానీకం భారీ స్వాగతం పలికింది. బారులు తీరిన జనంతో ప్రధాన వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రజల హర్ష ధ్వానాలు, స్వాగత నినాదాల మధ్య సామాజిక సాధికార యాత్ర ముందుకు సాగింది. వైఎస్సార్ సర్కిల్ నుంచి బహిరంగ సభ వేదిక వరకు జనాభిమానం పోటెత్తింది. వేదిక ముందు, వెనక అడుగు తీసి, అడుగు వేయలేనంతగా కిటకిటలాడింది. పక్కనున్న వీధులన్నీ జనాలతో నిండిపోయాయి. దీంతో ఆమదాలవలసలో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది.

కిక్కిరిసిన జనం మధ్య..

వాకలవలసలో ప్రెస్‌మీట్‌తో ప్రారంభమైన యాత్ర మోటార్ బైక్‌ల ర్యాలీతో ముందుకు సాగింది. వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించాక పట్టణంలో ప్రవేశించింది. దారి పొడవునా భారీగా తరలివచ్చిన జనం మధ్య బస్సు యాత్ర సాగడం కష్టతరమైంది. వేదిక వద్దకు వచ్చేసరికి కిక్కిరిసిపోవడంతో జనాలను అదుపు చేయలేని పరిస్థితి ఏర్పడింది. వేదిక ముందు, వెనక రద్దీ ఏర్పడంతో ఊపిరి తీసుకోలేనంత పని అయింది. అటువైపు వాళ్లు ఇటు రాకుండా, ఇటు వైపు వాళ్లు అటు వెళ్లకుండా పోలీసు కంట్రోల్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎందరు ఏకమైనా..



టీడీపీకి దమ్ముంటే 175 స్థానాల్లో పోటీ చేయాలి. ఎన్ని పార్టీలు ఏకమైనా జగనన్న ఒక్కరే పోటీకి వస్తారు. మంచి చేసే పార్టీకి ప్రజలు న్యాయం చేస్తారు. అబద్ధాలు చెప్పుకుని వస్తున్న చంద్రబాబు, అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, ఎంపీ రామ్మోహన్‌నాయుడులకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి.

– ధర్మాన కృష్ణదాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే

యాత్ర విశిష్టమైనది



ఈ సామాజిక సాధికార యాత్ర చాలా విశిష్టమైనది. సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలు మన్ననలు పొందుతున్న సీఎంను మళ్లీ గెలిపించాలి. అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా కల్పించి కుటుంబంలో తలెత్తుకుని జీవించేలా అండగా నిలిచిన ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలి.

– రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం



ఆమదాలవలసలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు



బస్సుయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి

ఊరంతా..కేరింత

ఆమదాలవలసలో జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్ర ఒక పండుగలా జరిగింది. ఒకవైపు అభిమానుల నృత్యాలు మరోవైపు వినసొంపైన వాయిద్యాలు.. జై జగన్ నినాదాలతో హోరెత్తిపోయింది. ఎటు చూసినా జగన్ నినాదమే వినిపించింది. బహిరంగ సభలో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ప్రభుత్వ సలహాదారులు జూపూడి ప్రభాకర్, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేసిన ప్రసంగాలు ఉర్రూతలూగించాయి. ప్రతిపక్షాలు ఆడుతున్న డ్రామాలు, చంద్రబాబు వేస్తున్న దొంగనాటకాలు, ఆయన అధికారంలో ఉన్నంతకాలం చేసిన అక్రమాలు, యాక్టర్ రాజకీయ నాయకుడిగా చంద్రబాబుకు వంతపాడుతున్న పవన్‌కల్యాణ్ తీరుపై స్పీకర్, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు కడిగిపారేసిన తీరుతో బహిరంగ సభ ఆద్యంతం ఆసక్తిగా సాగింది.



మెట్టక్కివలసల నుంచి బైక్ ర్యాలీలో పార్టీశ్రేణుల ఉత్సాహం

కార్యక్రమంలో పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, వైవీ సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, గొర్లె కిరణ్‌కుమార్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పొందర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్, మహిళా రీజనల్ కో ఆర్డినేటర్ బెందాళం పద్మావతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతాడ మంజు, తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ, మండల పార్టీ అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, బెవర మల్లేశ్వరరావు, పప్పల రమేష్‌కుమార్, ఖండాపు గోవిందరావు, పొడుగు శ్రీనివాసరావు, ఎంపీపీలు కేవీజీ సత్యన్నారాయణ, కర్నేన దీప, కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీలు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, బెజ్జిపురపు రామారావు, లోలుగు కాంతారావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, కొవిలాపు చంద్రశేఖర్, బగాది నారాయణమూర్తి, కొంచాడ రమణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్లు బెవర కృష్ణవేణి, బాడాన సునీల్, సాహిత్య అకాడమీ డైరెక్టర్ జేజే మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అభిమాన తరంగం





ఆమదాలవలసలో మంగళవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రకు అన్ని వర్గాల నుంచి అపూర్వ స్పందన లభించింది. యువత, మహిళలు, వృద్ధులు.. ఇలా ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా యాత్రలో పాల్గొని సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, స్పీకర్ తమ్మినేని సీతారాంపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. -ఆమదాలవలస రూరల్/ఆమదాలవలస/సరుబుజ్జిలి/పొందూరు/బూర్జ

క్లీన్ స్వీప్ ఖాయం

● స్పీకర్ తమ్మినేని సీతారాం



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: పొత్తుల్లేకుండా పోటీ చేస్తున్నామని, 175 స్థానాల్లోనూ విజయం సాధిస్తామని, జగనే జనమనే నినాదంతో ఎన్నికల్లో విజయ దుందుభి మోగిస్తామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సుయాత్రను నిర్వహించే ముందు శ్రీకాకుళం రూరల్ మండలం వాకలవలసలోని అభయాంజనేయ ఫంక్షన్ హాల్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అన్ని వర్గాలకు న్యాయం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు, బ్యాక్‌బోన్ క్లాసెస్ అని నిరూపించారని ప్రశంసించారు. మన పిల్లల భవిష్యత్ బాగుండాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. కులం, మతం, జెండా భేదం లేకుండా సంక్షేమం అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. నాయీ బ్రాహ్మణులు, మత్స్యకారులు, ఎస్టీ వర్గాల వారితో చంద్రబాబు మాట్లాడిన తీరు ఇంకా ఎవరూ మర్చిపోలేదని అన్నారు. వారందరికీ పదవులు ఇచ్చి వైఎస్ జగన్ వారిలో ఆత్మ గౌరవాన్ని పెంచారని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ సుమారు 139 సామాజిక వర్గాలకు 56 కార్పొరేషన్లతో సామాజిక హోదా కల్పించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, మైనార్టీలతో కలిసి ఐదుగురిని ఉపముఖ్యమంత్రులుగా చేశారని అన్నారు. 32 లక్షల ఇళ్ల పట్టాలిచ్చి మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా గౌరవం కల్పించారని అన్నారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏపీలో సామాజిక సాధికారత, రాజకీయ, విద్య, మహిళా సాధికారత ఇచ్చారని అన్నారు. సంక్షేమ కార్యక్రమాల ద్వారా నేరుగా సంక్షేమ లబ్ధిని తమ ఖాతాల్లోనే వేస్తూ బీసీ, ఎస్సీ, మైనారిటీ, అన్ని వర్గాల నిరుపేదలకు ఆర్థిక సాధికారత ఇచ్చారని చెప్పారు. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ వంటి మహానుభావుల ఆశయాలను నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్ వారికి అసలైన వారసుడని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస సామాజిక సాధికార యాత్ర



వంగపండు ఉష జానపద గేయ ప్రదర్శనలో తమ్మినేని వాణి తదితరులు



బస్సుయాత్ర వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్‌ను వీక్షిస్తున్న జనం

3,21,854 మంది రైతులు.. రూ.132.41 కోట్లు

● జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల
● అన్నదాతల సంక్షేమమే ధ్యేయమన్న మంత్రి ధర్మాన



నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తదితరులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలోని రైతులు, కౌలు రైతులు, అటవీ భూముల సాగుదారులకు వరుసగా ఐదో ఏడాది పథకం నిధులను సీఎం జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేశారని రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. జిల్లాలో 3,21,854 మంది రైతులు, కౌలు రైతులు, అటవీభూముల సాగుదారులకు 2023 -24 సంవత్సరానికి రెండో విడత సహాయం కింద రూ.132.41 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేసినట్లు వివరించారు. రైతు వేసే ప్రతి అడుగుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతు భరోసా కేంద్రాలు రైతు కార్యాలయాలుగా రూపుదిద్దుకున్నాయని చెప్పారు.

● కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ రైతులకు సమయానికి ఉపయోగపడేలా రైతు భరోసా నిధులు అందజేయడం మంచి పరిపాలనకు సూచనగా పేర్కొన్నారు. ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడంతో పాటు రైతులు పండించే పంటను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు.

● నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రతి రైతు శాస్త్ర సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకాలంలో సాగునీరు అందించాలనే లక్ష్యంతో వంశధార, నాగావళి నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గతంలో ధాన్యం కొనుగోలులో కొన్ని సమస్యలు వచ్చాయని, ఈ ఏడాది అటువంటి సమస్య లేదన్నారు.

● ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామానికి చెందిన లబ్ధిదారు దువ్వాడ అనూష మాట్లాడుతు ఐదో సంవత్సరం రెండో విడత రైతు భరోసా అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారంలో తిలకించారు. రైతులకు నమూనా చెక్కు అందజేశారు. వ్యవసాయ అనుబంధ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు తిలకించారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నేతాజీ, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, అగ్రిమిషన్ సభ్యుడు గొండు రఘురామ్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, జిల్లా ఉద్యాన అధికారి వరప్రసాద్, ఎల్‌డీఎం సూర్యప్రకాష్, మూకళ్ల తాతబాబు, గొండు కృష్ణారావు, జెడ్పీటీసీ మూకళ్ల సుగుణ, ఎంపీటీసీలు, ఎంపీపీలు, రైతులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం హత్య

● సొంత తమ్ముడ్ని కిరాతకంగా చంపిన అన్నయ్యలు!
● కేసరపడలో దారుణం



బద్రి ఖేత్రో(ఫైల్)

కంచిలి: ఆస్తి పంపకాల్లో ఏర్పడిన తగాదాలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. తమ్ముడ్ని సొంత అన్నయ్యలే కిరాతకంగా హత్య చేశారు. కంచిలి మండలం కేసరపడ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. వివరాల్లోకి వెళితే.. కేసరపడకు చెందిన బద్రి ఖేత్రో(32), వాసు, కూర్మారావు అన్నదమ్ములు. కొంతకాలంగా వీరి మధ్య ఆస్తి పంపకాల్లో గొడవలు జరుగుతున్నాయి. బద్రి ఖేత్రో మర్చంట్ నేవీలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఆస్తి తగాదా కారణంగా ఏడాదిన్నరగా గ్రామంలోనే ఉండిపోయాడు. ఇతనికి గత ఏడాది ఫిబ్రవరి 12న ఒడిశా రాష్ట్రం జయంతుపురం గ్రామానికి చెందిన శిరీషతో వివాహమైంది. వీరికి మూడు రోజుల క్రితం మగబిడ్డ జన్మించాడు. భార్య శిరీషకు బరంపురంలోని క్రిష్టియన్ ఆసుపత్రిలో సిజేరియన్ జరగడంతో అక్కడే చికిత్స పొందుతోంది. బద్రి ఖేత్రో ఒక్కడే ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తాళ్లసాగరం చెరువు వైపు బహిర్భూమికి వెళ్లగా సమీపంలో పంట పొలాల్లో అతికిరాతకంగా హత్యకు గురయ్యాడు. తల వెనుక భాగం, ఎడమ కాలు నరికేశారు. ఆస్తి పంపకాల్లో తగాదా వల్లే తన భర్తను వాసు, కూర్మారావులు హత్య చేశారని భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ ఎస్.బాలరాజు కేసు నమోదు చేశారు. సోంపేట సీఐ ఆర్. రవిప్రసాద్ సమక్షంలో విచారణ చేపడుతున్నారు. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి మంగళవారం పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన క్లూస్ టీం మృతదేహం వద్ద ఆధారాలను సేకరించారు. మృతదేహానికి సోంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.